జీపీ భవనాలకు మోక్షమెప్పుడో?


శిథిలావస్థలో రామాపురం గ్రామ పంచాయతీ భవనం

- వడ్డేపల్లి మండలంలో 2 జీపీ భవనాలు మంజూరు
- నిధులు మంజూరైనా పనులు ప్రారంభించలేదు..
- ప్రస్తుతం రూ.20 లక్షలు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు
- భవనాలు లేక పాఠశాలలు, అద్దె భవనాల్లో నిర్వహణ
- ఇబ్బందులకు గురవుతున్న అధికారులు, ప్రజలు

శాంతినగర్: 'అన్ని ఉన్నా అల్లుని నోట్లో శని' అన్న చందంగా గ్రామ పంచాయతీ భవనాల తీరు ఉంది. గ్రామాల అభ్యున్నతి కోసం కేంద్రం గ్రామ పంచాయతీలకు నేరుగా నిధులు మంజూరు చేసినా, గ్రామాలు మాత్రం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక రాష్ట్రంలో కొత్త గ్రామ పంచాయతీలు వందల సంఖ్యలో ఏర్పాటు చేశారు. ప్రతి మండలంలో 4 నుంచి 10 వరకు కొత్త పంచాయతీలు ఏర్పడ్డాయి. వాటి నిర్వహణకు సంబంధించి భవనాలు నిర్మించలేదు. కొత్త గ్రామ పంచాయతీలకు భవనాలు లేక, పాత పంచాయతీలకు శిథిలావస్థలో ఉన్న భవనాల్లో నిర్వహణ బాగాలేక ఇబ్బందులకు గురవుతున్నారు. వడ్డేపల్లి మండలంలోని పది గ్రామ పంచాయతీల్లో జక్కిరెడ్డిపల్లి, వెంకట్రామనగర్, బుడమర్సులో గ్రామ పంచాయతీ భవనాలు లేక ప్రభుత్వ పాఠశాలలోని చిన్న గదుల్లో నిర్వహిస్తున్నారు. రామాపురం, బుడమొర్సు గ్రామాల్లో నిధులు మంజూరైనా స్థలం తక్కువగా ఉందని నూతన భవనాలు నిర్మించడం లేదు. రామాపురంలో శిథిలావస్థ భవనంలోనే కొనసాగుతుండగా, బుడమర్సులో ప్రభుత్వ పాఠశాల గదిలో కార్యకలాపాలు జరుపుతున్నారు. జిల్లా పంచాయతీరాజ్‌శాఖ అధికారులు, ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు స్పందించి మంజూరైన నూతన భవనాలకు నిధులు మంజూరు చేసి కొత్త భవనాలు నిర్మించి అధికారులకు, ప్రజలకు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

పాఠశాల గదుల్లో..

వడ్డేపల్లి మండలంలో పది గ్రామ పంచాయతీలున్నాయి. వాటిలో 6 పంచాయతీలకు దశాబ్దాల క్రితం నిర్మించిన సొంత భవనాలున్నాయి. మిగతా 4 పంచాయతీల్లో బుడమర్సు, వెంకట్రామనగర్ పంచాయతీ కార్యాలయాలు ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగుతున్నాయి. రామాపురం గ్రామ పంచాయతీ, తనగల శిథిలావస్థలో ఉన్న పాత భవనాల్లో నిర్వహిస్తున్నారు.

స్థలాల కొరత..

గతంలో గ్రామ పంచాయతీ భవనాలు రెండు గదుల్లో నిర్మించారు. ప్రస్తుతం ఆరు గదులు నిర్మించడానికి నిధులు మంజూరైనా భవనానికి అవసరమైన స్థలాలు లేక నిర్మాణం చేయలేదని అధికారులు చెబుతున్నారు. రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు స్పందించి ఆయా గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలను గుర్తించి కొత్త గ్రామ పంచాయతీ భవనాలు నిర్మించాలి.


వెంకట్రామనగర్‌లో ప్రాథమిక పాఠశాలలోని చిన్నగదిలో గ్రామ పంచాయతీ కార్యాలయం

విద్యార్థులకు ఇబ్బంది..



బుడమర్సులో గ్రామ పంచాయతీ భవనం లేనందున పాఠశాలలో ఏర్పాటు చేశారు. కొద్దిరోజుల్లో బడి తెరుస్తారు. గ్రామ పంచాయతీ కార్యాకలాపాలు, పాఠశాల ఒకే చోట ఉండటంతో విద్యార్థుల చదువుకు ఇబ్బందిగా ఉంటుంది. మీటింగ్‌లు, ప్రతినిత్యం పంచాయతీ సిబ్బంది, సెక్రటరీ కార్యకలాపాలు నిర్వహిస్తుంటారు. వివిధ పనుల నిమిత్తం వారి కోసం ప్రజలు వస్తుంటారు. కొత్త భవనం ఏర్పాటుచేసి విద్యార్థులకు ఆటంకం లేకుండా చూడాలి.

– తిమ్మప్ప, మాజీ సర్పంచ్, బుడమర్సు

పాత బిల్లులే రాలేదు..



గ్రామ పంచాయతీ కొత్త భవనానికి రెండేళ్ల క్రితం రూ.20 లక్షలు మంజూరయ్యాయి. మేము గతంలో చేసిన పనులకు సంబంధించి రూ.20 లక్షల వరకు బిల్లులు రాలేదు. సర్పంచ్‌గా ఉన్న సమయంలో కొత్త భవనాన్ని రెండు నెలల్లో నిర్మించాలని ఆదేశించారు. ఇతరులు ఎవరైనా నిర్మించాలని కోరినా ఎవరూ ముందుకు రాలేదు. ప్రస్తుతం ప్రాథమిక పాఠశాలలోని ఓ గదిలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు.

– ఆంజనేయులు, మాజీ సర్పంచ్, వెంకట్రామనగర్

స్థలాలు లేక ప్రారంభించలేదు..

వడ్డేపల్లి మండలంలోని రామాపురం, కొంకల, తనగల, బుడమర్సు, తిమ్మాజిపల్లి, జిల్లెడిదిన్నె గ్రామ పంచాయతీలకు పాత భవనాల స్థానంలో కొత్తవి రెండేళ్ల క్రితం మంజూరయ్యాయి. స్థలాల కొరత, బిల్లులు రావడంలేదంటూ ఎవరు పనులు ప్రారంభించలేదు. ఈఏడాది వెంకట్రామనగర్, జక్కిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీలకు సంబంధించి కొత్త భవనాల నిర్మాణానికి ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి. నిర్మాణం 15 రోజుల్లో మొదలు పెడతాం. గతంలో భవనాలు మంజూరైన గ్రామాల్లో స్థలం కేటాయిస్తే వాటిలో కూడా పనులు మొదలు పెడతాం.

– రెడ్డప్ప, డీఈ, పంచాయతీరాజ్ శాఖ, మానవపాడు

క్లుప్తంగా

ముగిసిన సమ్మర్ కోచింగ్ సెంటర్



అయిజ: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మే 1 నుంచి జూన్ 6వ తేదీ వరకు నిర్వహించిన తైక్వాండో సమ్మర్ కోచింగ్ సెంటర్ నిర్వహణ శనివారంతో ముగిసింది. సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లో మొత్తం 40 మంది బాల బాలికలు పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమంలో తైక్వాండో మాస్టర్లు శ్రీహరి, సుధీర్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ



అయిజ: హైదరాబాద్‌లోని ఓల్డ్ సఫల్ గూడలోని సాయి మారుతి ఓల్డ్ ఏజ్ హోంలో అయిజ పట్టణానికి చెందిన జలగరి వెంకట్రాములు వర్ధంతిని పురస్కరించుకొని వారి కుటుంబ సభ్యులు శనివారం వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో న్యాయవాది జలగరి అశోక్, అరవింద్ కుమార్, శారద, ఓల్డ్ ఏజ్ హోం నిర్వాహకులు పాల్గొన్నారు.

ఉండవెల్లి ఎస్ఐ బదిలీ

ఉండవెల్లి: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎస్ఐ మహేష్‌గౌడు బదిలీపై వంగూరు మండలానికి వెళ్లారు. దీంతో స్టేషన్ ఇన్‌చార్జిగా హెడ్ కానిస్టేబుల్ వీరన్న బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

పంట పొలాల్లోకి దూసుకెళ్లిన ఆటో

పాన్‌గల్: అదుపుతప్పి ఆటో పంట పొలాల్లోకి దూసుకెళ్లిన ఘటన శనివారం మండలంలో చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తెల్లరాళ్లపల్లితండాకు చెందిన శ్రీనునాయక్ కుటుంబం తండా నుంచి హైదరాబాద్‌కు ఆటోలో వెళ్తున్న క్రమంలో దావాజిపల్లి స్టేజీ సమీపంలో మలుపు వద్ద ఎదురుగా వచ్చే వాహనాన్ని తప్పించే క్రమంలో అదుపుతప్పి వ్యవసాయ పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో ఆటోలో ఉన్న ఐదుగురి కుటుంబ సభ్యుల్లో ఒక మహిళకు రక్త గాయాలయ్యాయి. ఆటో అద్దాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఓ చెట్టుకు తాకి ఆటో ఆగిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. క్షతగాత్రురాలిని వెంటనే ప్రైవేట్ వాహనంలో వనపర్తి ఆస్పత్రికి తరలించారు. ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

మొక్కజొన్న పంట ధ్వంసం: కేసు నమోదు

ఖిల్లాఘనపురం: మొక్కజొన్న పంటను ట్రాక్టర్‌తో దున్ని నాశనం చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసిన ఘటన శనివారం ఖిల్లాఘనపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని ఉప్పరిపల్లికి చెందిన కుర్వ పెద్ద శాంతయ్య తన పేరున పట్టా ఉన్న వ్యవసాయ పొలం (సర్వే నంబర్లు 198ఈ1, 198ఈ2) లోని 3 ఎకరాల 15 గుంటల్లో మొక్కజొన్న పంట సాగు చేశాడు. ఈ పంటను ఖిల్లాఘనపురం గ్రామానికి చెందిన బాధితుడి కుమార్తె పూల చంద్రకళ, ఆమె భర్త పూల నవీన్, ఉప్పరిపల్లికి చెందిన పెద్ద కుర్వ రామకృష్ణ ఈ నెల 4న సాగు చేసిన మొక్కజొన్న పంటను ట్రాక్టర్‌తో దున్ని నాశనం చేశారు. పంటను విత్తుకోవడానికి ఖర్చు రూ.10,500 అయినట్లు బాధితుడు తెలిపారు. ఈ విషయమై శనివారం బాధితుడు పెద్ద కుర్వ శాంతన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్‌గౌడు తెలిపారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం

పాన్‌గల్: మండలంలోని గోప్లాపూర్‌లో సీతా రామాంజనేయ స్వామి ఆలయంలో మూడు రోజుల పాటు కొనసాగుతున్న సీతారాముల విగ్రహ, నవగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, బొడ్రాళ్ల పండుగ, సత్యానారాయణస్వామి ఆలయంలో విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూజల్లో మంత్రి జూపల్లి కృష్ణారావు, డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ ఆడపడుచులకు చీరసారెలను పెట్టి తమ ఆచార సంప్రదాయాలను చాటుకున్నారు. భక్తులకు అన్నప్రసాద వితరణను గ్రామానికి చెందిన సురభి కిషన్‌రావు ఆధ్వర్యంలో చేపట్టారు. గ్రామానికి చెందిన దాత సోమిశెట్టి కిశోర్‌కుమార్‌శెట్టి విగ్రహాలను ఇప్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్‌నాయక్, నందిమళ్ల అశోక్, మాజీ ఎంపీటీసీ కృష్ణ, వీరసాగర్, లక్ష్మి, చిట్యాల రాము, శేషిపాణి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శ

గట్టు: మండలంలోని నల్లగట్టుతండాకు చెందిన వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ మున్యానాయక్ కుటుంబాన్ని శనివారం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. మున్యానాయక్ తల్లి డాకిరి మృతి చెందిన నేపథ్యంలో బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కలిశారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్, మాజీ ఎంపీటీసీ ఆనంద్‌గౌడ్, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ రఘు కుమార్‌శెట్టి, నర్సన్‌గౌడు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయానికి విరాళం


ఆలయ పెద్దలకు విరాళం అందజేసిన భక్తులు

కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురం గ్రామంలో కొండపై వెలసిన శ్రీపాగుంట లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం కర్ణాటక రాష్ట్రం అవిష్పాడు గ్రామానికి చెందిన సెంట్రింగ్ రంగప్ప సరోజమ్మ దంపతులు నూతన మండపం అలివేలు మంగమ్మ విగ్రహం కోసం రూ.1,50,000 వేలు అందజేశారు. బూడిదపాడు గ్రామానికి చెందిన కుమ్మరి శ్రీను ఆలయ అభివృద్ధికి రూ.50వేలు ఆలయ పెద్దలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ పెద్దలు తదితరులు ఉన్నారు.

ఘనంగా ఏరువాక పౌర్ణమి


కేటీదొడ్డిలోని ఏరువాక పండుగ సందర్భంగా ఎద్దులతో ఊరేగిస్తున్న రైతులు

కేటీదొడ్డి: మండల కేంద్రంతో పాటు ఉమిత్యాల తదితర గ్రామాలలో ఏరువాక పౌర్ణమి పురస్కరించుకొని శనివారం రైతులు ఏరువాక వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుంకులమ్మ, పోలమ్మ ఆలయానికి మహిళలు బోనాలతో తరలివచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. రైతులు ఎద్దులను రంగులతో అందంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు, తదితరులు ఉన్నారు.

కేటీదొడ్డి: మండల కేంద్రంతో పాటు ఉమిత్యాల తదితర గ్రామాలలోని ఏరువాక పౌర్ణమి పురస్కరించుకొని రైతులు ఏరువాక వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుంకులమ్మ, పోలమ్మ ఆలయానికి మహిళలు బోనాలతో తరలివచ్చారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి రైతులు ఎద్దులను రంగులతో అందంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు తదితరులు ఉన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

కేటీదొడ్డి: క్రీడాకారులకు క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ఆడాలని కొండాపురం గ్రామపెద్దలు అన్నారు. మండలంలోని కొండాపురం గ్రామంలో నిర్వహించే మారెమ్మ దేవత ఉత్సవాలు, ఏరువాక పౌర్ణమి పండుగను పురస్కరించుకొని క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ విజేతలకు మొదటి బహుమతి దాత ఎర్రబీంరెడ్డి, రూ.5,016, రెండో బహుమతి దాత కొమ్ము పాపిరెడ్డి రూ.3,016 అందజేశారు. క్రికెట్ టోర్నమెంట్ పాల్గొన్న క్రీడాకారులకు టీమ్స్ జెర్సీ దాతలు మహనందిరెడ్డి, మురళి, కనిగేరా సుధాకర్, యుగంధర్, చిన్న రంగారెడ్డి, అందజేశారు. కార్యక్రమంలో సిల్క్ దాతలు నారాయణ రెడ్డి, రవి, గ్రామ పెద్దలు, యువత, క్రీడాకారులు ఉన్నారు.


క్రీడాకారులకు బహుమతులు అందజేసిన గ్రామ పెద్దలు

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలి



వీపనగండ్ల: మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ మండల మత్స్యకార పారిశ్రామిక సహకార సంఘం నాయకులు నక్క వెంకటస్వామి, సంగనమోని వెంకటయ్య, మిద్దె శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10న కలెక్టరేట్ ఎదుట నిరసన నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. మండలంలోని మత్స్యకారులు అధిక సంఖ్యలో నిరసన కార్యక్రమాల్లో పాల్గొనాలని వారు కోరారు. మండల కేంద్రంతో పాటు గోవర్ధనగిరిలో నిరసనకు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. వీరికి వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు మద్దతు ప్రకటించారు.

రేపు వాహనాల వేలం

ఆత్మకూర్: ప్రొహిబిషన్, ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం ఆత్మకూర్‌లో సోమవారం వాహనాల వేలం నిర్వహిస్తున్నట్లు సీఐ యమునాధర్‌రావు తెలిపారు. వివిధ కేసుల్లో పట్టుబడిన బైకులు వేలం ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమవుతుందని, ఆసక్తి ఉన్నవారు నిర్ణీత రుసుము చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

ఇథనాల్ ఫ్యాక్టరీ అనుమతి రద్దుచేయాలి

అయిజ: రాజోళి మండలం పెద్ద ధన్వాడ గ్రామం సమీపంలో నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణం అనుమతి రద్దు చేయాలని ఎంఎస్‌పీ జిల్లా కన్వీనర్ రాజు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా 12 గ్రామాల ప్రజలు ఏడాదికాలంపాటు పోరాటం చేస్తున్నారన్నారు. ఇథనాల్ ఫ్యాక్టరీని నిర్మించరాదని చేపట్టిన నిరసన కార్యక్రమం హింసాత్మకం కావడానికి ప్రేరేపించిన వారెవరో జిల్లా ఎస్పీ గుర్తించాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజల పక్షాన ఉంటే ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణం సాధ్యమెలా అవుతుందని అన్నారు. అమాయక రైతులు అరెస్ట్ కావడానికి, జైలుపాలు కావడానికి కారకులెవరని ప్రశ్నించారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఇథనాల్ ఫ్యాక్టరీని ఇతర ప్రాంతానికి తరలించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ డేవిడ్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు ఏసన్న, బీఎస్పీ నాయకులు సుందర్‌రాజు, నరసింహులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఎస్‌పీ జిల్లా కన్వీనర్ రాజు

ప్రాగటూరు కోటను పర్యాటకం చేయాలి

ఉండవెల్లి: మండలంలోని ప్రాగటూరు గ్రామ శివారులోని కృష్ణానది తీరం ఒడ్డున పురాతన కోట గోడలున్నా, వాటికి ఎంతో ప్రాముఖ్యత, చరిత్ర ఉందని, వాటిని పర్యాటక శాఖ అధికారులు పరిశీలించి పర్యాటక కేంద్రంగా మార్చాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం బీజేపీ నాయకులు కోట గోడలను పరిశీలించారు. 200 ఎకరాల విస్తీర్ణం, 2000 ఏళ్ల నాటి చరిత్ర గల కోటను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రాగటూరు కోటను పట్టించుకొని పర్యాటకంగా తీర్చి దిద్దాలని కోరారు. కార్యక్రమంలో నాగేశ్వర్‌రెడ్డి, పిడుగు వెంకటేష్, రాజశేఖర్ శర్మ, ఉపేందర్, గోపి, సుంకన్న, రాజేశ్వర్ రెడ్డి, చందు, సూరి, రంగస్వామి పాల్గొన్నారు.


ప్రాగటూరు కోట గోడలు పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు


అలంపూర్ ఈద్గా వద్ద ప్రత్యేక నమాజ్ చేస్తున్న ముస్లింలు

- ఈద్గా, మజీదులలో నమాజ్, ప్రార్థనలు

సాక్షి నెట్‌వర్క్: త్యాగానికి ప్రతీక అయిన ముస్లింల బక్రీద్ పండుగను శనివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పండుగ సందర్భంగా అలంపూర్‌లో ముస్తాబు చేసిన ఈద్గాలు, మజీదులలో ముస్లింలు ప్రత్యేక నమాజ్, ప్రార్థనలు చేశారు. ఉదయం కొత్త బట్టలు ధరించిన అల్లాహ్ నామ స్మరణతో ఈద్గాలకు సమూహంగా తరలి వెళ్లారు. అక్కడ ప్రత్యేక నమాజ్, ప్రార్థన చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకోని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పట్టణాల్లో, గ్రామాల్లో పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు, బంధు-మిత్రులు ఆలింగనం చేసుకోని బక్రీద్ పండుగ శుంభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈద్గాల వద్ద ఎస్ఐ వెంకటస్వామి బందోబస్తు ఏర్పాటు చేశారు.

❖ రాజోళి మండల కేంద్రం, గ్రామాల్లో బక్రీద్ పండుగ ఘనంగా నిర్వహించారు. మిత్రులు, సన్నిహితులతో కలిసి భోజనాలు చేశారు.

❖ అయిజ మండల కేంద్రం, గ్రామాల్లో ముస్లింలు బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని ముస్లిం మహిళలకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీషావలి ఆచారి ఆయన నివాసంలో చీరలు పంపిణీ చేశారు.

❖ ఉండవెల్లి మండలంలో బక్రీద్ పండుగను ఘనంగా నిర్వహించారు.

❖ శాంతినగర్, వడ్డేపల్లి మున్సిపాలిటీ, మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థన చేశారు. మాంసం, నిత్యావసర సరుకులు పేదలకు అందజేసి ఉదారతను చాటుకున్నారు.

❖ మల్దకల్ మండలంలో కుర్తిరావులచెర్వు జామియా మసీదు, ఎల్కూరు, మల్దకల్ గ్రామాల్లోని ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సింగిల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ పెద్ద వీరన్న, మండల మాజీ కోఆప్షన్ మెంబర్ మహబూబ్‌అలీలు శుభాకాంక్షలు తెలిపారు.

❖ గట్టులోని చెరువు దగ్గర ఉన్న ఈద్గాలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఈద్ ముబారక్ అంటూ శుభాకాంక్షలు తెలిపారు. పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్, మాజీ ఎంపీపీ విజయ్ కుమార్, మాజీ జెడ్పీటీసీ బాసు శ్యామల, మాజీ వైస్ ఎంపీపీ సుమతి, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ముస్లింలు జాఫర్, నన్నేసాబ్, మహబూబ్‌పాష, అబ్దుల్‌వాహబ్, హోటల్ ఇస్మాయిల్, మిన్నల్లా పాల్గొన్నారు.

❖ ఇటిక్యాల మండల కేంద్రం, ఆయా గ్రామాల్లో కుటుంబ సభ్యులతో కలిసి ఈద్గాల దగ్గర ముస్లింలు ప్రత్యేక ప్రార్థన చేశారు.

❖ కేటీదొడ్డి మండలంలో ఈద్గాలు, మసీదులలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

❖ ఎర్రవల్లి మండలంలో ముస్లింలు కుటుంబ సభ్యులతో కలిసి ఈద్గాల దగ్గరకు చేరుకొని భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

❖ ధరూరు మండల కేంద్రం, ఉప్పేరు, ర్యాలంపాడు, మార్లబీడు, మన్నాపురం, నెట్టెంపాడు, గార్లపాడు, చింతరేవుల, రేవులపల్లి గ్రామాల్లో ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సమాధుల వద్ద ప్రార్థన నిర్వహించారు.


అలంపూర్‌లో ఈద్గా వద్ద ఎస్ఐ వెంకటస్వామి


నందిన్నెలో..


మల్దకల్‌లో ..

పిల్లలను సర్కారు బడిలో చేర్పించండి


వల్లూరులో బడిబాటను చేపడుతున్న ఉపాధ్యాయులు

- బడిబాటలో అవగాహన కల్పిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు
- వివిధ కార్యక్రమాలతో ప్రచారం..

శాంతినగర్: ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని వెంకట్రామనగర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈశ్వరయ్య తల్లిదండ్రులను కోరారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా వడ్డేపల్లి మండలంలోని వెంకట్రామనగర్ ప్రభుత్వ పాఠశాలలో కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం గ్రామంలోని వీధుల్లో తిరుగుతూ ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిశారు. 6 నుంచి 10 ఏళ్లలోపు పిల్లలందరిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉంటారని, భోజనం, దుస్తులు, పాఠ్య పుస్తకాలు అందజేస్తామని వివరించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ ఆంజనేయులు, తిప్పన్న, ఏఫోన్, బి.ఆంజనేయులు పాల్గొన్నారు.

❖ మానవపాడు మండలంలోని ఆయా పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయులు 6వ తేదీ నుంచి ప్రతి ఇంటికి వెళ్లి బడిబాటలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని ఎంఈఓ శివప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో జల్లాపురం హెచ్‌ఎం విష్ణువర్ధన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

❖ ఎర్రవల్లి మండలంలోని వల్లూరులో బడిబాట జెడ్పీహెచ్ఎస్ హెచ్‌ఎం నారాయణచారి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్య, ఆహారం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కావలి మన్యం, కిరణ్, రవిప్రకాష్, తదితరులు ఉన్నారు.

❖ ధరూరు మండలంలో ఉపాధ్యాయులు ముమ్మరంగా బడిబాట ప్రచారం నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని రేవులపల్లి, దోర్నాల, మన్నాపురం, పెద్దపాడు గ్రామాల్లో ఉపాధ్యాయులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ రవీంద్రబాబు, జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి ఉన్నారు.


ధరూరులో ఇంటింటి ప్రచారంలో ..


జల్లాపురంలో